క్లుప్తంగా

నారాయణస్వామి ఆదాయం రూ.1.31 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,31,612 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్. నరసింహ బాబు తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.56,790, లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ.22,830, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.42,992, శ్రీపాదకానుకగా రూ.9 వేలు వచ్చినట్లు తెలిపారు. అన్నదానానికి మండలంలోని డీజీపేట గ్రామానికి చెందిన మితికేల ఆదినారాయణ, కుమారిలు రు.10,116 విరాళంగా ఇచ్చినట్లు చైర్మన్, ఈఓ తెలిపారు.

మాలకొండయ్యకు ఘన నివాళి



మాలకొండయ్య భౌతికకాయంవద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పామూరు: మండలంలోని అయ్యవారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు యాసరపు మాలకొండయ్య(76) అనారోగ్యంతో మృతి చెందాడు. ఈసందర్భంగా సోమవారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, గట్లా విజయభాస్కర్ రెడ్డి, స్థానిక నాయకులు మాలకొండయ్య భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బాసు మాలకొండారెడ్డి, సైకం పుల్లారెడ్డి, తుమ్మా పిచ్చిరెడ్డి, తాతిరెడ్డి రాజు, కందుల సుబ్బారెడ్డి, తిండి నరసింహారెడ్డి, జడ యేసయ్య, జడ దావీదు, చిట్టిబాబు పాల్గొన్నారు.

మసీదుల వద్ద పరిశుభ్రతా చర్యలు

కనిగిరిరూరల్: పట్టణంలోని అన్ని మసీదుల వద్ద పరిశుభ్రతా చర్యలు చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్‌గఫార్ అన్నారు. పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని మసీదుల వద్ద సోమవారం పరిశుభ్రతా కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని ఏడో వార్డు పరిధిలో ఉన్న మసీదు ప్రాంతంలో, వార్డుల్లో చెత్త, వ్యర్థాలను తొలగించి, పిచ్చిమొక్కలను తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించి, శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించారు..

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

పామూరు: మండలంలోని మోపాడు బంగ్లాకు చెందిన విద్యార్థిని ముప్పారపు షైనీ ఇటీవల కావలిలో రైలు ప్రమాదానికి గురై నెల్లూరు నారాయణ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. క్షతగాత్రురాలి వైద్యఖర్చుల నిమిత్తం సోమవారం మానవతా పామూరు మండల కమిటీ అధ్యక్షుడు మేడబలిమి ముసలయ్య, తోట రమేష్, వెండిదండి వెంకటేశ్వరరెడ్డి సంస్థ తరపున, దాతలసాయంతో రూ.41,700 నగదును వారి కుటుంబసభ్యులు అందజేశారు.

260 పొగాకు బేళ్లు కొనుగోలు

కొండపి: స్థానిక పొగాకు వేలంకేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో కనిష్ట ధర రూ. 260 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. కోయవారిపాలెం దాదానాయుడుపాలెం, ధర్మవరం గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 285 బేళ్లను తీసుకురాగా అందులో 260 బేళ్లను కొనుగోలు చేసి వివిధ కారణాలతో 25 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, సరాసరి ధర రూ.277.31 పలికింది. వేలంలో 11 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

నూరుశాతం పన్నులు వసూలు చేయాలి

పామూరు: నూరుశాతం ఇంటిపన్ను వసూళ్లే లక్ష్యంగా స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్‌ఆర్‌డీ, పీఎస్ గంగిరెడ్డి అరవిందారెడ్డి తెలిపారు. పామూరులోని పలువార్డుల్లో సిబ్బంది ఇంటింటికి వెళ్లి పన్ను వసూళ్లు ప్రారంభించారు. 2025 మార్చి 31నాటికి పూర్తి పన్ను వసూళ్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇంటిపన్ను చెల్లించినవారు వెంటనే రసీదు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో జి.రత్న కుమార్, కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

విజయ్‌భాస్కరెడ్డికి సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న విజయ్‌భాస్కరెడ్డి

హనుమంతునిపాడు: వైఎస్సార్ సీపీ నాయకుడు, వ్యాపార వేత్త, చిట్టాల వెలుగొండారెడ్డి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డికి ప్రతిష్టాత్మక సీఎస్ఆర్ సౌత్ ఇండియా ఆధ్వర్యంలో సేవా పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు గాను పురస్కారం దక్కిందన్నారు.

వేలానికి వేళాయే..!

- 19 నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభం
- తగ్గిన లో గ్రేడ్ పొగాకు
- ఆశాజనకంగా పొగాకు రంగు
- ధరలపైనే రైతుల ఆశలు



టంగుటూరులో పొగాకు గ్రేడింగ్ పరిశీలిస్తున్న ప్రాంతీయ అధికారి లక్ష్మణరావు

టంగుటూరు: గత రెండేళ్ల పాటు పొగాకు పంట రైతులకు లాభాల పంట పండించింది. గతంలో ఎన్నడూ ఊహించని ధరలు పలకడంతో గత ఏడాది మంచి లాభాలు పొందారు. ఈ క్రమంలో ఈ ఏడాది పొగాకు సాగు విస్తీర్ణం పెరిగింది. దీంతో పెట్టుబడులు అమాంతం పెరిగాయి. భూముల కౌలు ధరల నుంచి బ్యార్నీ కౌలు, కొట్టుడు ఖర్చు ఇలా అన్నీ పెరగడంతో పెట్టుబడి తడిసి మోపడైంది. ఈ ఏడాది పొగాకు నాణ్యత కూడా బాగుంది. లో గ్రేడ్ కూడా 10 శాతానికి తగ్గింది. ఈ నేపథ్యంలో ధరలపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 19 నుంచి టంగుటూరు బోర్డు పరిధిలో పొగాకు వేలం ప్రారంభం కానుంది.

అటు పనులు..ఇటు కొనుగోళ్లు

మండలంలో ఈ ఏడాది పొగాకు సాగు దశల వారీగా సాగుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ రైతులు వాతావరణం కారణంగా మొక్కలకు నీరుకడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆకు రెల్చుతుండగా, మరి కొన్ని ప్రాంతాల్లో గ్రేడింగ్ పూర్తి చేసి పొగాకు బేళ్లు కడుతున్నారు. బుధవారం నుంచి వేలం ప్రారంభం కానుండటంతో రైతులంతా బిజీ బిజీగా పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే వేలం ప్రారంభమైన కొన్ని కేంద్రాల్లో ధరలు మోస్తారు ఉండటం రైతులకు కలిసొచ్చే అంశం. టంగుటూరు పొగాకు వేలంకేంద్రం పరిధిలో ఈ ఏడాది 2,828 మంది రైతులు 2807 బ్యార్నీల్లో 6,234 హెక్టార్లలో పొగాకు సాగు చేశారు. అనధికారికంగా మరో 2 వేల హెక్టార్లలో సాగు చేసినట్లు తెలిసింది. బోర్డు 11.72 మిలియన్ల కిలోల విక్రయానికి అనుమతి రాగా మరో 16.5 మిలియన్ల కిలోల పొగాకు విక్రయానికి అనుమతి రావాల్సి ఉందని బోర్డు అధికారులు తెలిపారు.

తగ్గిన లో గ్రేడ్ దిగుబడి

ఈ ఏడాది సాగు ప్రారంభంలో వర్షాలు కురవడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ వర్షాలు పొగాకు నాణ్యతను దెబ్బతీస్తాయని భావించారు. కానీ ఈ ఏడాది లో గ్రేడ్ దిగుబడి తక్కువ రావడంతో రైతులకు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 2022–23 సీజన్‌లో లో గ్రేడ్ పొగాకు 20 నుంచి 25 శాతం వచ్చింది. 2023–24 సీజ్‌లో 20 శాతానికి తగ్గింది. అయితే గత ఏడాది లో గ్రేడ్ పొగాకుకు మంచి ధరలు రావడంతో రైతులకు లాభాలు వచ్చాయి. ఈ ఏడాది కేవలం 10 శాతం మాత్రమే లో గ్రేడ్ దిగుబడి వచ్చిందని రైతులు చెబుతున్నారు. దీంతో మార్కెట్‌లో ధరలు కాస్త నిలకడగా ఉంటే పెట్టుబడి పెరిగినా లాభాలు పొందవచ్చంటున్నారు. బుధవారం నుంచి పొగాకు కొనుగోళ్లకు బోర్డు అధికారులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే బోర్డు అధికారులు, కొనుగోలు సంస్థల ప్రతినిధులు, వేలం కేంద్రాల రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి పొగాకు కొనుగోళ్లు, గ్రేడింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించి అవగాహన కల్పించారు.

అన్య పదార్థాలు లేకుండా చర్యలు తీసుకోవాలి



పొగాకు గ్రేడింగ్ సమయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పొగాకులో అన్య పదార్థాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్లాస్టిక్, బీడీ ముక్కలు, గాజు ముక్కలు వంటి అన్య పదార్థాలు ఉండరాదు. అన్య పదార్థాలు ఉంటే ఎగుమతులపై ప్రభావం పడుతుంది. గ్రేడింగ్ చేసిన పొగాకులో తేమ శాతం సరిచేసుకొని బేళ్లు తయారు చేసుకోవాలి. పొగాకు మండెలను ఎప్పటికప్పుడు తిరగవేసుకోవాలి. 150 కిలోలకు మించి బేలు తయారు చేయవద్దు. మంచి గ్రేడుకు మార్కెట్‌లో ధరలు బాగుంటాయి. ఈ ఏడాది పొగాకు రంగు, నాణ్యత బాగుంది.

– అట్లూరి శ్రీనివాసరావు, వేలం నిర్వహణాధికారి, టంగుటూరు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

- అందరం కలిసి ముందుకు సాగుదాం
- వైఫల్యాలపై ప్రభుత్వాన్ని నిలదీద్దాం
- జగనన్నని మళ్లీ సీఎం చేసుకుందాం
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న దద్దాల నారాయణ

పీసీపల్లి : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ ధ్వజమెత్తారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన నాయకులు, కార్యకర్తల సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దద్దాల మాట్లాడుతూ 9 నెలల కూటమి ప్రభుత్వంలో ప్రజలకు చేసింది శూన్యమన్నారు. సూపర్‌సిక్స్‌తో పాటు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన ఏ ఒక్క పథకాన్ని ప్రజలకు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అందరం కలిసికట్టుగా ముందుకు సాగి ప్రభుత్వ వైఫల్యాలను నిలదీద్దామని పిలుపునిచ్చారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకునేందుకు అందరూ శక్తివంచన లేకుండా కృషి చేద్దామన్నారు. సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో సంక్షేమ పథకాలతో పాటు గతంలో ఎన్నడూ లేని విధంగా మెడికల్ కాలేజీలు, పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించారన్నారు. పార్టీ మండల అధ్యక్షునిగా గోపవరపు బొర్రారెడ్డి, ఉపాధ్యక్షులుగా పోలు జయరామిరెడ్డి, యేరవ నరసింహ చౌదరిలను నియమించామన్నారు. రెండు రోజుల్లో కమిటీ సభ్యులను పూర్తి చేస్తామన్నారు. మండల అధ్యక్షునిగా నియమితులైన గోపవరపు బొర్రారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా బొర్రారెడ్డి మాట్లాడుతూ మరోసారి మండల అధ్యక్షునిగా నియమించినందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పెద్దిరెడ్డి లక్ష్మీకాంత ఓకే రెడ్డి, మేకల మాల్యాద్రి, భూమిరెడ్డి కొండారెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, కటికల వెంకటరత్నం, సైకం ఏడుకొండలురెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, పల్నాటి భాస్కర్ రెడ్డి, గోడి నారాయణ రెడ్డి, పాపబత్తిన నాగేశ్వరావు, మైలా రమణమ్మ, గుంటగాని భాస్కర్, పరిమి వెంకట్రావు, తాళ్లూరి మరియమ్మ, మోతుకూరి నరేంద్ర, నల్లగంగుల శ్రీను, మూలె రాజశేఖరరెడ్డి, శీలం సుదర్శన్, కొండ్రు నరసింహం, ఉండెల వెంగళరెడ్డి, పరుచూరి రమేష్, శ్రీకాంత్, నాగేశ్వరరావు, దత్తాత్రేయ రెడ్డి,వేణుగోపాల్ రెడ్డి, నరాల కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు



కనిగిరిలో పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి



టంగుటూరు: పరీక్ష రాసి బయటకు వస్తున్న కూతురుతో మాట్లాడుతున్న తండ్రి

కనిగిరిరూరల్: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో 1424 మంది విద్యార్థులకు 1419 మంది హాజరు కాగా ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షల తొలి రోజు కావడంతో కేంద్రాల వద్ద విద్యార్థులు వారి తల్లిదండ్రుల సందడి నెలకొంది,. విద్యార్థులు వారి ఇష్ట దేవతలకు ప్రార్థనలు చేసుకొని పరీక్ష కేంద్రాల వద్దకు వచ్చారు.

పామూరు: మండలంలో 5 పరీక్ష కేంద్రాల్లో సోమవారం పదోతరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 742 మంది విద్యార్థులకు గాను 738 మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారు. పరీక్షలను చీఫ్ సూపరింటెండెంట్లు మందాకుమారి, బి.డేవిడ్, అరియారం సురేష్, జె.పోతురాజు, ఎన్.వెంకట్రామయ్య, డీఓలు నాగేంద్రరావు, యం.రామస్వామి, తిరుపతయ్య, ఎస్‌కే.షరీఫ్, ఖాజామస్తాన్‌లు పర్యవేక్షించగా పరీక్షా కేంద్రాలను ఎంఈఓ గరికపాటి కరుణకుమారి తనిఖీచేశారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలో తొలి రోజు పదో తరగతి పరీక్షలకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 349 మంది విద్యార్థులకు గాను 346 మంది పరీక్షలు రాశారు. పరీక్షలను చీఫ్ సూపరింటెండెంట్‌లు చావా శ్రీనివాసులు, అబ్దుల్ సుబాన్, డీఓలు బాషా, ఖాజారంతుల్లాలు పర్యవేక్షించగా పరీక్షా కేంద్రాలను మండల విద్యాశాఖాదికారులు జే.ప్రసాదరావు తనిఖీచేశారు.

హనుమంతునిపాడు: మండలంలో పదో తరగతి పరీక్షలకు ఒక విద్యార్థి గైర్హాజరయ్యాడు. పరీక్ష కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఎంఈఓలు జి.పెద్దిరాజు, ఎస్ రమణయ్య కేంద్రాలను పరిశీలించారు.

టంగుటూరు: మండలంలో తొలి రోజు పదో తరగతి పరీక్షలకు అందరూ హాజరయ్యారు. మూడు కేంద్రాల్లో 506 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా అందరూ హాజరయ్యారు. ఎస్సై నాగమల్లేశ్వరరావు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలో సోమవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ బి.నాగేంద్రవదన్ తెలిపారు. రెండు పాఠశాలల్లో 340 మంది విద్యార్థులకు గాను 337 మంది హాజరైనట్లు తెలిపారు.

మర్రిపూడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలకు 296 మందికి గాను ఒక విద్యార్థి గైర్హాజరయ్యాడు. చీఫ్ సూపరింటెండెంట్లుగా శ్యాంసన్, దశరదరామిరెడ్డి, డిపార్ట్‌మెంట్ అధికారులుగా వై కృష్ణప్రసాదు, హనుమంతరావులు వ్యవహరించారు.

సింగరాయకొండ: మండలంలో సోమవారం ప్రారంభమైన పరీక్షలకు ముగ్గురు గైర్హాజరైనట్లు ఎంఈఓ కత్తి శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 843 మంది విద్యార్థులకు గాను 840 మంది హాజరయ్యారు. తొలి రోజు కావడంతో ఉదయం 8 గంటలకే విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పోలీసులుగట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తికి నివాళులు



యర్రం పిచ్చమ్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న దద్దాల, ఇతర నేతలు



పిచ్చమ్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న కొండపి నియోజకవర్గ నేతలు

కనిగిరిరూరల్: రాజ్యసభ సభ్యుడు, టీటీడీ పాలకమండలి మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మకు వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ నివాళులర్పించారు. పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీల సంఘ అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ గాయం సావిత్రి, పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, కల్లూరిరామిరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు గాయం బలరాంరెడ్డి, గాయం ఈశ్వరమ్మ, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, సైకం ఏడుకొండలురెడ్డి, కటికల వెంకటరత్నం తదితరులు ఉన్నారు.

సింగరాయకొండ: రాజ్యసభ సభ్యుడు, టీటీడీ పాలక మండలి మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ భౌతికకాయానికి పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ వెంకయ్య, పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్ రెడ్డి నివాళులర్పించారు. పార్టీ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సుల్తాన్, జిల్లా అంగన్‌వాడీ అధ్యక్షురాలు కనపర్తి గోవిందమ్మ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యనమల మాధవి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా కిరణ్‌కుమార్, రాపూరి ప్రభావతి, షేక్ అల్లాభక్షు, షేక్ మహమ్మద్ బాషా, కె హనుమంతరావు పాల్గొన్నారు.

బాలినేనీ..స్థాయి తెలుసుకొని మాట్లాడు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

- జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి నీకు లేదు
- బాలినేనిపై వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం

సింగరాయకొండ: ' మా అధినేత జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి నీకెక్కడది. ముందు నీ స్థాయి ఏంటో తెలుసుకో..నీ స్వార్థం కోసం పార్టీలో గ్రూపు రాజకీయాలకు తెరలేపావ్..' అంటూ వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ నేతలు బాలినేని శ్రీనివాసరెడ్డిపై మండిపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలినేనిపై వారు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్టీ మేధావుల ఫోరం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అప్పట్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, నిన్నటి వరకు జగన్‌మోహన్‌రెడ్డి దయ వల్లే బాలినేనికి ఇచ్చారని గుర్తు చేశారు. కానీ పీఠాపురం జనసభ ఆవిర్భావ సభలో జగన్‌మోహన్‌రెడ్డిని బాలినేని ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం దారుణమన్నారు. రాష్ట్రంలో ఏ నాయకుడి ఇవ్వని ప్రాధాన్యాన్ని జగన్‌మోహన్‌రెడ్డి బాలినేనికి ఇచ్చారని గుర్తు చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఢాకా పిచ్చిరెడ్డి మాట్లాడుతూ పార్టీలో కోట్లాది రూపాయల ఆస్తులు కూడబెట్టిన బఆలినేని..ఇప్పుడు నా ఆస్తులు, నా వియ్యంకుడి ఆస్తులు జగనన్న లాక్కున్నాడని ఆరోపించడం అతని దిగజారుడుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ఏరు దాటాక తెప్ప తగలేశాడన్న సామెతగా బాలినేని వ్యవహరిస్తున్నారన్నారు. జిల్లాలో పార్టీ టిక్కెట్లు ఇప్పిస్తానని చెప్పి అందరి వద్ద డబ్బులు వసూలు చేయలేదా అని ప్రశ్నించారు. పొన్నలూరు జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మా అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించినప్పుడే నీ పతనం ఆరంభమైందని బాలినేనిని హెచ్చరించారు. బీసీ సెల్ మాజీ కో ఆర్డినేటర్ బొట్ల రామారావు మాట్లాడుతూ జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో వేలు పెట్టి గ్రూపులు సృష్టించి పార్టీ ప్రతిష్టను దిగజార్చావని ఆరోపించారు. అధికారం లేనిదే బాలినేని ఒక్క అరగంట కూడా ఉండలేడన్నారు. అందుకే జనసేన పార్టీలో చేరాడని ధ్వజమెత్తారు. పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ మాచేపల్లి నాగయ్య, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు పుట్టా వెంకట్రావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యనమల మాధవి తమ శైలిలో బాలినేనిపై ధ్వజమెత్తారు. పార్టీ రైతు విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తాటికొండ రామచంద్రరావు, రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ యన్నాబత్తిన చిన్నా, రాష్ట్ర మైనారిటీ సెల్ జాయింట్ సెక్రటరీ పఠాన్ రియాజ్, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సుల్తాన్, జిల్లా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు గోవందమ్మ, జిల్లా సెక్రటరీ ఎం చిన వెంకటేశ్వర్లు, జిల్లా సెక్రటరీ కె.బ్రహ్మయ్య, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాలు



డ్రోన్ వినియోగంపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న సీఐ సోమశేఖర్

కొండపి: నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాలు సహాయపడతాయని సీఐ సోమశేఖర్ అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ పరిధిలోని ఎస్సైలకు పోలీస్ సిబ్బందికి డ్రోన్ కెమెరాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ కెమెరా వినియోగంపై సర్కిల్ పరిధిలోని ప్రతి సిబ్బంది అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు డ్రోన్ కెమెరా ద్వారా అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు, ఏ ప్రాంతంలో ఎలాంటి పరిస్థితులు జరుగుతున్నాయో డ్రోన్ కెమెరా ద్వారా పరిశీలించి చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. డ్రోన్ కెమెరా వల్ల నేరాల నియంత్రణకు అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు. కొండపి ఎస్సై ప్రేమ్‌కుమార్, పొన్నలూరు ఎస్సై అనూక్, సర్కిల్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలం



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను కొనుగోలు చేస్తున్న ఎంపీడీఓ

కొండపి: ప్రకృతి ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వ్యవసాయాధికారి డి. విజయకుమార్ అన్నారు. స్థానిక మండల కేంద్రంలోని ప్రభుత్వ భవనాల సముదాయం, ఇలవర, పెట్లూరు, పెరిదేపి రావులకొల్లు యూనిట్లలో ఏటీఎం మోడల్, ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను మార్కెటింగ్ నిర్వహించారు. ఎంపీడీఓ రామాంజనేయులు, తహసీల్దార్ మురళి, సీడీపీఓ మాధవిలత ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను కొనుగోలు చేశారు. పీసీఎంఎఫ్ మాస్టర్ ట్రైనర్ ఎస్తేరు, యూనిట్ ఇన్చార్జిలు రంజిత్, మందాకిని, మాధవ, ఐసీఆర్పీలు జ్యోత్స్న గౌతమి, సుహానా, ఏడుకొండలు పాల్గొన్నారు.

బంగారు బాల్యంపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంపీపీ

పామూరు: ఆరేళ్ల లోపు పిల్లలకు విధిగా ఆధార్ నమోదు చేయించాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి, తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీఓ ఎల్ బ్రహ్మయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య అధ్యక్షతన బంగారు బాల్యంపై మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహిచంచారు. బాల కార్మికవ్యవస్థ, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా, విద్యార్థుల డ్రాపౌట్స్‌ను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించడం, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించడం, వెట్టి చాకిరి నిర్మూలన అంశాలపై చర్చించి తీర్మానం చేశారు. ఏపీఎం గంటా విద్యాసాగర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, ఎన్‌జీఓ షేక్.నాయబ్‌రసూల్, గ్రామసమైఖ్యసంఘం అధ్యక్షురాలు ఓ.సుబ్బమ్మ, అమల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పీసీపల్లి: బాల్య వివాహాలను ప్రోత్సహించకూడదని ఎంపీడీఓ బ్రహ్మయ్య అన్నారు. స్థానిక మండల కేంద్రంలోని వైఎస్సార్ సెంటర్‌లో బంగారు బాల్యంపై ఎంపీడీఓ బ్రహ్మయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాయా, విద్యార్థుల డ్రాపౌట్స్‌పై సమీక్షించారు. ఎంపీపీ గంగసాని లక్ష్మి, తహసీల్దార్ కేవీ రామారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, ఏపీఎం జి.విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

కనిగిరిరూరల్: పెన్షనర్ల, విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించి, అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తమ్మినేని పెద్దిరెడ్డి, ఆర్‌ఎంపీఎల్ నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వం 12వ పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి, ఐఆర్‌ను చెల్లించాలన్నారు. అసోసియేషన్ ట్రెజరర్ ఎం వెంకటరెడ్డి, సంఘ నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, వి.మాలకొండారెడ్డి, జి.నాగభూషనం, చెన్నయ్య, గౌస్ మోహిద్దీన్, ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రామకృష్ణయ్య, యర్రారెడ్డి, కృష్ణమూర్తి, కరీముల్లా పాల్గొన్నారు.